



జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు



సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.

శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో

సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



ఆదివారం 17 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 349 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్




## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతం చేయాలి


సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 17, ప్రతినిధి: ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుండి 23 వరకు నిర్వహించే యువజన, క్రీడా, పర్యాటక వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి స్పెషల్ సీఎస్‌లు జయేష్ రంజన్, వాణి ప్రసాద్ లతో కలిసి శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కార్యక్రమాలపై సమీక్షించారు. యువతలో క్రీడాస్ఫూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం పెంపొందించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించి ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ నెల 18న "ఫిట్ తెలంగాణ" థీమ్‌తో రాష్ట్ర, జిల్లా కేంద్రాల్లో 5కే రన్, మండల కేంద్రాల్లో వాక్‌థాన్, యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు వారోత్సవాలు దోహదపడతాయని, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని మ్యూజియంలలో వారం రోజుల పాటు ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు వెల్లడించారు. అనంతరం జిల్లాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.



## దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 17, ప్రతినిధి: రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి దేవాదుల ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై సచివాలయంలో విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఆర్ శ్రీధర్, ప్రభుత్వ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని జిల్లాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా సమావేశంలో హాజరై పనుల పురోగతిపై చర్చించారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## ఉప్పల్ రింగ్ రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపులు




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 17, ప్రతినిధి: మల్కాజిగిరి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ పిల్లర్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఉప్పల్ రింగ్ రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపులు అమల్లోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఉప్పల్ జిహెచ్‌ఎంసీ కార్యాలయం పక్కన ఉన్న వరంగల్, హనుమకొండ, యాదగిరిగుట్ట బస్సుల నిలయాన్ని తాత్కాలికంగా నల్లచెరువు కట్ట సమీపానికి మార్చినట్లు అధికారులు తెలిపారు. ఈ మార్గాల్లో ప్రయాణించే ప్రయాణికులు తాత్కాలిక బస్ స్టాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 17వ తేదీ ఉదయం నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డులో వరంగల్ వైపు వెళ్లే రహదారిని తాత్కాలికంగా మూసివేయనున్నట్లు వెల్లడించారు. వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనదారులు మే ఫీల్ హోటల్ దాటిన తర్వాత ఉప్పల్ భాగాయత్ మీదుగా నాగోల్ చేరుకుని సర్వీస్ రోడ్డులో ప్రయాణించాలని సూచించారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్లే వారు సర్వే ఆఫ్ ఇండియా జంక్షన్ వద్ద పిస్తా హౌస్ పక్కనుండి బీరప్పగడ్డ మీదుగా జాతీయ రహదారి 163 ద్వారా ప్రయాణించాలని తెలిపారు. భారీ వాహనాలు, వరంగల్ బస్సులు ఓఆర్ఆర్ మార్గంలో హయత్‌నగర్ మీదుగా హైదరాబాద్ చేరుకోవాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని అధికారులు కోరారు.



## నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డ్స్ ఘనంగా నిర్వహణ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 17, ప్రతినిధి: తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో "నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డ్స్–2025" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. CETI ఫౌండేషన్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉర్దూ జర్నలిస్టు స్వర్గీయ నసీమ్ ఆరిఫీ సేవలను స్మరించుకుంటూ వివిధ విభాగాల్లో అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ విదేశాంగ శాఖ కార్యదర్శి, సీనియర్ దౌత్యవేత్త డాక్టర్ ఆసఫ్ సయీద్ మాట్లాడుతూ ఉర్దూ మీడియా రంగానికి నసీమ్ ఆరిఫీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. యువ జర్నలిస్టులు నిబద్ధతతో, సామాజిక బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నసీమ్ ఆరిఫీపై అకాడమీ ముద్రించిన మోనోగ్రాఫ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టుల జీవిత చరిత్రలు, అనుభవాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు 12 మోనోగ్రాఫ్‌లను విడుదల చేసినట్లు తెలిపారు. CETI ఫౌండేషన్ వ్యవస్థాపకులు సయ్యద్ బషారత్ అలీ కార్యక్రమాన్ని నిర్వహించగా, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎహ్తేశామ్ అహ్మద్ ఖాన్ అవార్డుల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు అమీర్ ఉల్లా ఖాన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీకి చెందిన మాసూమా మురాదాబాద్‌కు జీవిత సాఫల్య పురస్కారం అందజేయగా, యామీన్ అన్సారీ, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అలీ మొహియుద్దీన్, ఎం.డి. ఫజల్ బైగ్, రోహిణి సింగ్‌లకు నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డ్స్–2025 ప్రదానం చేశారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, సీనియర్ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు, సాహితీవేత్తలు, ఉర్దూ భాషాభిమానులు పాల్గొన్నారు.

## నెక్లెస్ రోడ్డులో గ్రీనాథాన్-2026 మారథాన్ నిర్వహణ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 17, ప్రతినిధి: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా గ్రీనాథాన్-2026 కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్డులో "రన్ ఫర్ బయోడైవర్సిటీ" మారథాన్ నిర్వహించనున్నట్లు తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు కార్యదర్శి కాళిచరణ్ ఎస్ ఖర్తాడే తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు 21కే, 10కే, 5కే, 3కే విభాగాల్లో మారథాన్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పద్మభూషణ్, పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, అర్జున అవార్డు గ్రహీత సైనా నెహ్వాల్, ప్రముఖ రెజ్లర్ శంకీ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అతిథులుగా పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ మారథాన్‌లో సుమారు ఐదు వేల మంది రన్నర్లు పాల్గొననున్నారని వెల్లడించారు.

# పోసానిపేట గ్రామంలో వరుసగా మొబైల్ హ్యాకింగ్ ఘటనలు–ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సందేశం టైమ్స్, అందోల్ మండలం, మే 17, మండల ప్రతినిధి: అందోల్ మండలంలోని పోసానిపేట గ్రామంలో ఇటీవల వరుసగా అండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు హ్యాక్ అవుతున్న ఘటనలు చోటుచేసుకుంటుండటంతో గ్రామ ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో సందేశం టైమ్స్ మండల రిపోర్టర్ వి. వెంకటేశం గ్రామ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన తెలిపారు. మొబైల్ ఫోన్లకు తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులు, నకిలీ అప్లికేషన్లు, బ్యాంక్ కేవైసీ పేరుతో వచ్చే సందేశాలు ఓపెన్ చేయడం వల్ల మొబైల్ పూర్తిగా హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా వాట్సాప్, టెలిగ్రామ్, సందేశాల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. కొంతమంది గ్రామస్థుల మొబైల్ ఫోన్లలో ఆటోమేటిక్‌గా అప్లికేషన్లు ఇన్‌స్టాల్ కావడం, బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన సందేశాలు రావడం, ఫోన్లు నెమ్మదిగా పనిచేయడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. మొబైల్ వినియోగదారులు అధికారిక అప్లికేషన్ స్టోర్‌లో లేని యాప్స్ డౌన్‌లోడ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఓటీపీలు, బ్యాంక్ పాస్‌వర్డ్‌లు, ఏటీఎం వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని సూచించారు. అలాగే మొబైల్‌లో యాంటీవైరస్ అప్లికేషన్ వినియోగించడం, బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవడం, అవసరం లేని యాప్స్ తొలగించడం మంచిదన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు పూర్తి అవగాహన అవసరమని, చిన్న పొరపాటు వల్ల ఆర్థిక నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. గ్రామ ప్రజలు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండి, ఏవైనా అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు వచ్చిన వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ యువత మరియు ప్రజలు మొబైల్ వినియోగంలో జాగ్రత్తలు పాటించి సైబర్ మోసాలకు గురికాకుండా ఉండాలని వి. వెంకటేశం విజ్ఞప్తి చేశారు.

# ఆధ్యాత్మిక సాగరమైన చిట్కుల్... వైభవంగా శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీనివాస కళ్యాణం



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 17, బి. డేవిడ్: ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా, భక్తుల జయజయధ్వానాల మధ్య ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్‌లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయం ఒక మినీ తిరుపతిని తలపించింది. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నీలం మధు ముదిరాజ్ – కవిత దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లోక కళ్యాణార్థం నిర్వహించిన శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఫసల్వాది జ్యోతిర్వాస్తు పీఠం మహేశ్వర సిద్ధాంతి శర్మ, భూపతి స్వామి ఆశీస్సులతో సిరిసిల్ల బీటుకూరి నవీన్ ఆచార్య పర్యవేక్షణలో అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా కళ్యాణ వేడుకలు నిర్వహించారు. లోక కళ్యాణార్థం, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలనే సత్సంకల్పంతో నిర్వహించిన ఈ వేడుకకు భక్తజనం పోటెత్తింది. కళ్యాణ మహోత్సవం కోసం చిట్కుల్‌లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయం ఆవరణలో భారీ వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై శ్రీవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ఈ కళ్యాణాన్ని నిర్వహించామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న తమకు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఎంతో మానసిక తృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికలలో గెలుపోటములతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల చెంత ఉండి సేవలందిస్తామని పునరుద్ఘాటించారు. ఈ వేడుకను వీక్షించేందుకు చిట్కుల్‌తో పాటు పటాన్‌చెరు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ, ముత్తంగి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అంతకుముందు నీలం కవిత మధు దంపతుల నివాసంలో ప్రత్యేక పూజలు, యజ్ఞాధి కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తజనానికి అన్నదాన కార్యక్రమం నిర్వహించి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, కాంగ్రెస్ మండల, బ్లాక్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.

# శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక పూజలు



సందేశం టైమ్స్, జహీరాబాద్, మే 17, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా బర్దిపూర్ మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శని అమావాస్య మరియు శ్రీ శనేశ్వర జయంతి సందర్భంగా ఆశ్రమంలో అభిషేకాలు, హోమాలు, తుల తైల ముట్టాభిషేక యజ్ఞం, జేష్ఠాదేవి సమేత శ్రీ శనేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ ఛైర్మన్ రామ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రారంభం



సందేశం టైమ్స్, వట్పల్లి, మే 17, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితాల సమగ్ర సవరణ కార్యక్రమం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ను భారత ఎన్నికల సంఘం ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్ల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతకు ఓటరు హక్కు కల్పించడంతో పాటు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, ద్వంద్వ ఓటర్ల పేర్లను తొలగించే చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లో ఈ కార్యక్రమం అమలులో ఉండగా, 2002 నుండి 2005 మధ్య జన్మించిన యువతపై ప్రత్యేక దృష్టి సారించారు. అధికారుల వివరాల ప్రకారం రాష్ట్రంలో లక్షల సంఖ్యలో కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే వేల సంఖ్యలో దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో బీఎల్‌వోల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల జాబితాను నవీకరిస్తున్నారు. తెలంగాణలో బేస్ రోల్ 2002 సంవత్సరాన్ని ఆధారంగా తీసుకొని, 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసిన వారికి ఓటు నమోదు చేపడుతున్నారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించి, అవసరమైన పత్రాలను పరిశీలించి జాబితాను సిద్ధం చేస్తున్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించి, తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు.

# అందోల్ మండల కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు



సందేశం టైమ్స్, అందోల్ మండలం, మే 17, మండల ప్రతినిధి: అందోల్ మండలం కురుమ సంఘం మరియు గొర్రెల పెంపకదారుల సంఘాల ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం సంగుపేట్ గ్రామంలో ఘనంగా నిర్వహించబడింది. మండలంలోని కురుమల సంక్షేమం, గొర్రెల పెంపకదారుల సమస్యలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. మండలంలోని వివిధ గ్రామాల సంఘ ప్రతినిధులు, నాయకులు, సభ్యులు భారీ సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామ స్థాయిలో కురుమల కమిటీ హాళ్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావిస్తూ, సంఘ కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యేక భవనాలు లేకపోవడంతో సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే ఆందోల్ మండల కేంద్రంలో ప్రత్యేకంగా మండల కురుమల కమిటీ హాల్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. కమిటీ హాల్ నిర్మాణం ద్వారా సంఘ కార్యక్రమాలు, సమావేశాలు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. గొర్రెలు, మేకల పెంపకంపై కూడా సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. పశువులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నట్టల మందులు అందించాలని, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెల పెంపకం అనేక కుటుంబాలకు జీవనాధారమని, ప్రభుత్వం మరింత ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని కోరారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని త్వరగా ప్రారంభించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మొదటి విడతలో లబ్ధి పొందని అర్హులైన పేద గొర్రెల పెంపకదారులకు రెండో విడతలో అవకాశం కల్పించాలని నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ నవాబు, భూమయ్య, ఆందోల్ మండల కురుమ సంఘం అధ్యక్షులు గడ్డమీది విట్టల్, మండల మాజీ అధ్యక్షులు బి. సంగమేశ్వర్, మండల కురుమ సంఘం యువజన అధ్యక్షులు గొరిల్లా రమేష్, ఉపాధ్యక్షులు డి. రవిరాజ్, ప్రధాన కార్యదర్శి బాల మల్లేష్, సహ కార్యదర్శి డి. అశోక్, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే మండల కమిటీ సభ్యులు ప్రవీణ్, పి. మల్లేశం, అశోక్, గ్రామ అధ్యక్షులు బి. శివశంకర్, బి. మల్లేష్, యూ. యాదయ్య, పత్తి వీరేశం, నారాయణ తదితర సభ్యులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు. సమావేశం అనంతరం సంఘ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 17, ప్రతినిధి: జనగణన–2027లో భాగంగా సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, జనాభా గణన మరియు గృహ జాబితా కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. రామాయంపేట మండలం అక్కన్నపేట్ గ్రామంలో జనగణన–2027 ఇండ్ల లెక్కింపు కార్యక్రమాన్ని ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజిని, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్‌లతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి హౌస్ లిస్టింగ్ (ఇంటింటి సర్వే) ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. ఎన్యూమరేటర్లకు ప్రజలు ఖచ్చితమైన వివరాలను అందించాలని సూచించారు. సేకరించిన వివరాలన్నీ గోప్యంగా ఉంటాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించామని తెలిపారు. జనగణన ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, ఇందులో భాగస్వాములు కావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి జూన్ 9 వరకు జరిగే ఇండ్ల గణన సర్వేను పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజిని, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన ధరల పెంపును ఉపసంహరించుకోండి: సీపీఐ(ఎం) డిమాండ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 17, ప్రతినిధి: కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన అనంతరం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3, సీఎన్‌జీపై కిలోకు రూ.2 చొప్పున పెంచడం వల్ల ఇప్పటికే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, స్తంభించిన వేతనాలతో సతమతమవుతున్న శ్రామిక ప్రజలపై మరింత భారం పడుతుందని అన్నారు. ప్రపంచ ముడి చమురు ధరలు పెరిగిన కారణంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు అండర్ రికవరీలు ఎదుర్కొంటున్నామని చెబుతున్న సమర్థన తప్పుదోవ పట్టించేదని ఆమె విమర్శించారు. గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తక్కువగా ఉన్న సమయంలో ఆయిల్ కంపెనీలు భారీ లాభాలు ఆర్జించాయని గుర్తు చేశారు. అండర్ రికవరీ అనే పదం వాస్తవ నష్టాలను సూచించదని, భవిష్యత్తులో పొందే అధిక లాభాలకు సంబంధించిన ఊహాజనిత లోటును మాత్రమే సూచిస్తుందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కూడా చమురు ధరల ద్వారా భారీ ఆదాయం పొందుతూ ప్రజలకు ప్రయోజనం చేకూర్చలేదని విమర్శించారు. అంతర్జాతీయ ధరలు పెరిగిన వెంటనే ఆ భారాన్ని సామాన్య ప్రజలపై మోపడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇంధన ధరల పెంపు వల్ల రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాథమిక సేవల ధరలపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. సీఎన్‌జీ ధరల పెంపు ఆటో డ్రైవర్లు, రవాణా కార్మికులు, ప్రజా రవాణాపై ఆధారపడిన లక్షలాది మందిని నేరుగా ప్రభావితం చేస్తుందని అన్నారు. ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఆలస్యం చేసి ఇప్పుడు అమలు చేస్తోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, ఏ. మహేందర్ రెడ్డి, కె. మల్లేశం, కార్యవర్గ సభ్యులు కడారి నాగరాజు, సంతోష్, బాబు, అజయ్, షౌకత్, దుర్గ, కొమురయ్య, యాదయ్య, లచ్చగౌడ్, లక్ష్మణ్, వెంకట్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# హోతి కె గ్రామంలో ఎమ్మెల్యే కొణింటే మాణిక్‌రావు పర్యటన



సందేశం టైమ్స్, జహీరాబాద్, మే 17, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని హోతి కె గ్రామంలో ఎమ్మెల్యే కొణింటే మాణిక్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి రవికుమార్ చౌహాన్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ధైర్యంగా ఉండాలని సూచిస్తూ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం గ్రామానికి చెందిన ఓ పాస్టర్ సతీమణి పాము కాటుతో మృతి చెందిన విషయం తెలుసుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ తంజీం, కౌన్సిలర్ మహిపాల్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాయిలసింగవరంలో నేడు ఉచిత న్యూరో వైద్య శిబిరం



సందేశం టైమ్స్, వాయిలసింగవరం, మే 17, ప్రతినిధి: వాయిలసింగవరం గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఆదివారం ఉదయం వినూత్న న్యూరో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత న్యూరో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు తెలిపారు. ఈ శిబిరంలో మెదడు, వెన్నుముక, నరాలు, పక్షవాతం, ఫిట్స్, తలనొప్పి, తిమ్మిర్లు, మతిమరుపు వంటి వ్యాధులకు న్యూరో ఫిజీషియన్ డాక్టర్ పి. హరికిరణ్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించనున్నారని పేర్కొన్నారు. అలాగే రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. న్యూరాలజీ సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, గ్రామ ప్రజలు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య సేవలు పొందాలని గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు కోరారు.



# రైతుల ధాన్యాన్ని సమయానికి తరలించాలి కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 17: రైతుల ధాన్యాన్ని సమయానికి తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జీఎం మార్కెటింగ్ అధికారి, ఆర్డీవో, డీఎంసీఎస్, డీఎస్ఓ, తహసీల్దార్, ఎంపీడీవోలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా టోకెన్ విధానం అమలులో ఉందా అనే అంశాన్ని పరిశీలిస్తూ నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని సూచించారు. కేంద్రాల్లో గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,32,992 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, మరో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉందని తెలిపారు. జిల్లాలోని 533 కేంద్రాల్లో 519 కేంద్రాలు ప్రస్తుతం కొనుగోళ్ల కోసం పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. టోకెన్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, ధాన్యం తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించాలని సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా కాంటాలు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ, రవాణా వివరాలను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా కొనుగోళ్లు జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజని, ఎంపీడీవో, సంబంధిత కొనుగోలు కేంద్ర నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.




# బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 17: మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్న సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ మాట్లాడుతూ ఫోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర సహాయ మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలని కోరారు. మహిళల రక్షణ గురించి మాట్లాడే కేంద్ర ప్రభుత్వం తన మంత్రివర్గంలోని మంత్రి కుమారుడిపై ఇలాంటి ఆరోపణలు వచ్చినా స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. బాధితురాలికి న్యాయం చేయాల్సిన పోలీసులు పారదర్శకంగా వ్యవహరించకుండా కేంద్ర మంత్రికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోంమంత్రిగా బాధ్యత వహిస్తూ వెంటనే స్పందించి బండి భగీరథను అరెస్టు చేయాలని కోరారు. ఫోక్సో కేసు నమోదైన తర్వాత కూడా నిందితుడిని అరెస్టు చేయకుండా సిట్ విచారణ పేరుతో కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్ర మంత్రివర్గంలోని మహిళా మంత్రులు కూడా ఈ అంశంపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. చట్టం అందరికీ సమానమని రాజ్యాంగం చెబుతుంటే ధనవంతులకు ఒక రకం, పేదలకు మరో రకంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, ఏ. మహేందర్ రెడ్డి, కె. మల్లేశం, బాలమని, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి నాగరాజు, సంతోష్, అజయ్ బాబు, కవిత తదితరులు పాల్గొన్నారు.



# త్వరితగతిన ధాన్యం అన్‌లోడింగ్ పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్ నగేష్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 17: ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మిల్లర్లను ఆదేశించారు. ఘన్పూర్ మండలంలోని పలు రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైస్ మిల్లర్లు అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా తక్షణమే ధాన్యం దిగుమతి చేపట్టి తూకం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. అకాల వర్షాలు సంభవించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన టార్పాలిన్లు మరియు నిల్వ సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం అన్‌లోడింగ్‌లో ఆలస్యం జరిగితే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కురుమ సంఘం మండల కార్యవర్గ సమావేశం నిర్వహణ



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 17: ఆందోల్ మండలం కురుమ సంఘం మరియు గొర్రెల పెంపకదారుల సంఘాల ఆధ్వర్యంలో సంగుపేట్ గ్రామంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో కురుమల కమిటీ హాళ్ల నిర్మాణం, ఆందోల్ మండల కేంద్రంలో మండల కురుమ సంఘం కమిటీ హాల్ ఏర్పాటు, గొర్రెలు మరియు మేకలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నట్టల మందులు అందించడం, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ నవాబు, భూమయ్య, ఆందోల్ మండల కురుమ సంఘం అధ్యక్షులు గడ్డమీది విట్టల్, మండల మాజీ అధ్యక్షులు బి. సంగమేశ్వర్, యూత్ ప్రెసిడెంట్ గొరిల్లా రమేష్, ఉపాధ్యక్షులు డి. రవిరాజ్, ప్రధాన కార్యదర్శి బాల మల్లేష్, సహ కార్యదర్శి డి. అశోక్, కోశాధికారి శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు ప్రవీణ్, పి. మల్లేశం, అశోక్, గ్రామ అధ్యక్షులు బి. శివశంకర్, బి. మల్లేష్, యూ. యాదయ్య, పత్తి వీరేశం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతుల్లో అలసత్వం వీడాలి : కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 17: ధాన్యం దిగుమతుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. రబీ మార్కెటింగ్ సీజన్ 2025-26 యాసంగి ధాన్యం కొనుగోళ్ల నేపథ్యంలో జిల్లాలోని అన్ని రైస్ మిల్లర్లు పీపీసీల నుంచి ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకొని కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్‌లో తప్పనిసరిగా పాల్గొనాలని పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొంతమంది మిల్లర్లు ప్రభుత్వ ఆదేశాలను పెడచెవిన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాపన్నపేట మండలంలోని మేసర్స్ శ్రీ సాయి లక్ష్మి ట్రేడర్స్ మరియు రామాయంపేటలోని మేసర్స్ భవాని ఇండస్ట్రీస్ పీపీసీల నుంచి కేటాయించిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోవడం గమనించబడిందన్నారు. దీనివల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత ప్రభుత్వ నిబంధనల ప్రకారం పై రెండు రైస్ మిల్లులను పాడి ప్రొక్యూర్‌మెంట్ మరియు కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్ నుంచి తక్షణ ప్రభావంతో బ్లాక్‌లిస్ట్ చేసినట్లు వెల్లడించారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయా మిల్లులకు ఎటువంటి ధాన్యం కేటాయింపు చేయబడదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని రైస్ మిల్లర్లు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటిస్తూ పీపీసీల నుంచి ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని, లేకపోతే సంబంధిత మిల్లులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు.

# వరి కొనుగోలు సమస్యలపై ఎమ్మార్వోకు వినతి పత్రం



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 17: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని నేరేడుగుంట - మక్తగూడెం గ్రామ రైతుల వరి కొనుగోలు సమస్యలపై ఆదివారం ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. గ్రామ రైతుల వరి కొనుగోలు ఆలస్యం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి వాహనాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రైతుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి నేరేడుగుంట మరియు మక్తగూడెం గ్రామాల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నేరేడుగుంట గ్రామ సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో యువజన కార్యక్రమాలు

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 17, ప్రతినిధి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 18 నుండి 23 వరకు మండల, జిల్లా స్థాయిలలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి తెలిపారు. మే 18న మారథాన్ వాక్ అండ్ రన్, శారీరక దృఢత్వ కార్యక్రమాలు జిల్లా స్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సూర్యాపేటలో ఉదయం 6.30 గంటలకు ప్రారంభమవుతాయని, మండల కేంద్రాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మే 19న కెరీర్ మరియు నైపుణ్యాత దినోత్సవం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీసీ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 20న ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో యువ నాయకత్వ సదస్సు, మే 21న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా దినోత్సవం ఉదయం 7 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. మే 22న యువతలో సామాజిక బాధ్యత పెంపొందించే కార్యక్రమాలు జిల్లా, మండల స్థాయిల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 23న కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఉద్యోగ సాధన కార్యక్రమం నిర్వహించి, జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు, సీఎం కప్–2025 రాష్ట్ర స్థాయి విజేతలకు మెడల్స్ మరియు సర్టిఫికెట్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని యువత, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



# రోజుకు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం


సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 17, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో ధాన్యం సేకరణపై వెబ్‌ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అనుకున్న స్థాయిలో ధాన్యం సేకరణ జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభంలో రోజుకు 5 వేల నుండి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినప్పటికీ ఇకపై రోజుకు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు సమయానికి లారీలు రాకపోవడం, వచ్చిన లారీలను కొన్ని నిర్దిష్ట మిల్లులకు మాత్రమే పంపడం వల్ల మిల్లుల వద్ద వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయని తెలిపారు. మండల తహశీల్దార్లు ప్రత్యేక బాధ్యత తీసుకొని మిల్లుల వద్ద వేగంగా అన్‌లోడింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. మిల్లుకు చేరుకున్న లారీలు 12 గంటల లోపు అన్‌లోడింగ్ పూర్తి చేయాలని, ఆలస్యం అయితే వెంటనే ప్రత్యామ్నాయ అన్‌లోడింగ్ కేంద్రాలకు మళ్లించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి లోడింగ్ పూర్తైన మూడు గంటల లోపు మిల్లులకు ధాన్యం తరలించాలని పేర్కొన్నారు. ఏ మిల్లుకు ఎన్ని లారీలు వెళ్తున్నాయి, ఎంత అన్‌లోడింగ్ జరిగింది, కొనుగోలు కేంద్రాలకు ఎన్ని లారీలు వస్తున్నాయనే పూర్తి వివరాలను రోజువారీగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో హమాలీల కొరత ఉన్నట్లు గుర్తించామని, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు అంతరాయం కలగకుండా మూడు షిఫ్టుల్లో హమాలీలు పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పీడీ సన్యాసయ్య, డీఎస్ఓ మోహనబాబు, డీసీఓ ప్రవీణ్ కుమార్, డీఎం సివిల్ సప్లయ్స్ శ్రీధర్ రెడ్డి, డీఎంఓ నాగేశ్వర శర్మ, ఏఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 17, ప్రతినిధి: తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి. రవికిరణ్ రెడ్డి తెలిపారు. జర్మనీకి చెందిన ప్రముఖ నియామక సంస్థ బిల్డర్ ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీ మరియు జర్మన్ అంతర్జాతీయ సహకార సంస్థ సమన్వయంతో ఈ ప్రత్యేక నియామక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జర్మన్ భాషా శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మొత్తం 90 పోస్టులను భర్తీ చేయనున్నారని, దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ మే 18, 2026 కాగా ఇంటర్వ్యూలు జూలై 8 నుంచి 17 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ నివాసితులు లేదా తెలంగాణలో గుర్తింపు పొందిన జీఎన్ఎమ్ లేదా బీఎస్సీ నర్సింగ్ కళాశాలల్లో చదువు పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 22 నుంచి 38 సంవత్సరాల మధ్య ఉండాలని, జీఎన్ఎమ్ అభ్యర్థులకు కనీసం మూడు సంవత్సరాల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. ఇండియన్ నర్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. వృద్ధాప్య సంరక్షణ, పాలియేటివ్ కేర్, ఆసుపత్రి సేవలు, ఇంటెన్సివ్ కేర్, జెరియాట్రిక్, కార్డియాలజీ, జనరల్ సర్జికల్, మెడికల్ వార్డ్ వంటి విభాగాల్లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రాథమిక ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి జర్మన్ భాషా శిక్షణ అందించబడుతుందని, ఆరు నెలల శిక్షణలో 70 శాతం మార్కులు సాధించిన వారికి మాత్రమే కార్యక్రమంలో కొనసాగింపు ఉంటుందని తెలిపారు. అనంతరం బీ1, బీ2 స్థాయి పరీక్షలు నిర్వహించి బీ1 స్థాయిలో 70 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జర్మనీలో ప్రారంభ వేతనం నెలకు సుమారు 2300 యూరోలు, భారత కరెన్సీలో సుమారు రూ.2.2 లక్షలు ఉంటుందని, అనుభవంతో అది రూ.3 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను germanytriplewin2025@gmail.com కు ఈ నెల 18లోపు పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440049645, 9440052081, 9440051581 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే [TOMCOM అధికారిక వెబ్‌సైట్](https://tomcom.telangana.gov.in?utm_source=chatgpt.com) ను సందర్శించాలని సూచించారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 17, ప్రతినిధి: జిల్లాలో జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతి, ఇంటింటి సర్వే ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 24 నుంచి జులై 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కాలంలో బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాల ద్వారా ఓటర్ల వివరాలు సేకరిస్తారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జూన్ 15 నుంచి 22 వరకు ఇంటింటి సర్వే ప్రారంభానికి అవసరమైన సన్నాహాలు పూర్తి చేయాలని, జూన్ 24 నుంచి బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ పేరు, మొబైల్ నంబర్, పోలింగ్ కేంద్రం వివరాలు తెలిసేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రముఖుల పేర్లు తప్పిపోయాయనే వార్తలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి రికార్డులను నవీకరించాలని తెలిపారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి వాటి మినిట్స్ భద్రపరచాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఐటీ బృందానికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, బీఎల్ఓలు మొబైల్ యాప్ తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, ఆర్డీవో వేణు మాధవరావు, ఎన్నికల సూపరింటెండెంట్ వాజిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# హై రిస్క్ గ్రూప్ సభ్యులకు న్యాయ అవగాహన సమావేశం




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 17, ప్రతినిధి: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల ప్రకారం హై రిస్క్ గ్రూప్ కమ్యూనిటీ సభ్యులకు న్యాయ సేవ సదన్‌లో న్యాయ అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హై రిస్క్ గ్రూప్ కమ్యూనిటీలకు సంబంధించిన న్యాయ హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత న్యాయ సహాయం, మహిళలు మరియు పిల్లల రక్షణ చట్టాలు, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక భద్రత వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి పౌరుడు న్యాయ సేవలను పొందే హక్కు కలిగి ఉన్నారని, ఆర్థిక లేదా సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని తెలిపారు. సమాజంలో వివక్ష, హింస వంటి సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ సభ్యులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 17, ప్రతినిధి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలుకు కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసిందన్నారు. ఇందులో భాగంగా జూన్ 15 నుంచి 24 వరకు సంబంధిత సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఎన్యూమరేషన్ ఫారాల ముద్రణ తదితర ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, పూర్తి చేసిన ఫారాలను తిరిగి స్వీకరిస్తారని చెప్పారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించి, ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 లోగా వాటిని పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభానికి ముందే ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 మందికి మించి ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారుల వివరాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగ ఓటర్ల నమోదుపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీడియా, సోషల్ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి తప్పుడు ప్రచారాన్ని అరికట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ సంగీత మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నామని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ పాండు, ఆర్డీఓ రాజేందర్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి : డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 17, ప్రతినిధి: యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పీడీ సన్యాసయ్య అధికారులను ఆదేశించారు. చివ్వెంల మండలం ఐలాపురం, తర్మీయా తండ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో నిర్వహిస్తున్న తూకాలు, రిజిస్టర్లు, ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం అకాల వర్షాల ముప్పు ఉన్న నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా లారీల రవాణాను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద తార్పాలిన్లు, గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడాలని, రైతులకు తాగునీరు మరియు నీడ సదుపాయాలు కల్పించాలని సూచించారు. కాంటా పూర్తైన వెంటనే ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసి రైతులకు సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.